## శ్రీ అరవిందయోగి

విరచిత

# సావిత్రి

ఒక గాథ, ఒక ప్రతీక

అనువాదం

ఆచార్య తంబిశెట్టి రామకృష్ణ

ఎమెస్కో

# విషయానుక్రమణిక

## మొదటి భాగము


మొదటి గ్రంథము: ఆవిర్భావముల గ్రంథము

| | | |
|---|---|---|
| మొదటి సర్గ | : వేకువ సంకేతము | 31 |
| రెండవ సర్గ | : ప్రస్తావన | 37 |
| మూడవ సర్గ | : భూపాలుని యోగసాధన: ఆత్మవిముక్తి యోగము | 47 |
| నాలుగవ సర్గ | : నిగూఢ జ్ఞానము | 72 |
| ఐదవ సర్గ | : భూపాలుని యోగ సాధన: చైతన్యముయొక్క విముక్తి, ఉత్థానము కొరకు యోగసాధన | 104 |

రెండవ గ్రంథము: భువన సంచయముల యాత్రికుడు

| | | |
|---|---|---|
| మొదటి సర్గ | : భూతలము | 127 |
| రెండవ సర్గ | : సూక్ష్మ పదార్థపు రాజ్యము | 135 |
| మూడవ సర్గ | : జీవన ఔన్నత్యము, దాని పతనము | 150 |
| నాలుగవ సర్గ | : చిన్ని జీవనపు రాజ్యములు | 168 |
| ఐదవ సర్గ | : చిన్ని జీవనపు దేవతామూర్తులు | 190 |
| ఆరవ సర్గ | : ఉన్నత జీవనపు దేవతామూర్తులు, వారి రాజ్యములు | 215 |
| ఏడవ సర్గ | : నిశీథములోనికి అధః పయనము | 249 |
| ఎనిమిదవ సర్గ | : మిథ్యా జగతి, దుష్కర్మల జనయిత్రి, నిశి పుత్రులు | 269 |
| తొమ్మిదవ సర్గ | : జీవన అధిదేవతల స్వర్గధామము | 284 |
| పదవ సర్గ | : చిన్ని మానసముల అధిష్ఠాన దేవతలు, వారి రాజ్యములు | 290 |
| పదకొండవ సర్గ | : బృహత్తర మానసముల అధిష్ఠాన దేవతలు, వారి రాజ్యములు | 316 |
| పన్నెండవ సర్గ | : ఆదర్శమూర్తుల స్వర్గధామములు | 336 |
| పదమూడవ సర్గ | : ఆత్మ చైతన్యము నిండిన మానసము | 343 |

పదునాల్గవ సర్గ : విశ్వాత్మ 349

పదిహేనవ సర్గ : మహత్తర జ్ఞాన సామ్రాజ్యములు 358

మూడవ గ్రంథము : జగన్మాత వృత్తాంతము

మొదటి సర్గ : అవాఙ్మానస గోచరముల అన్వేషణ 367

రెండవ సర్గ : జగన్మాత స్తుతి 372

మూడవ సర్గ : చైతన్యముయొక్క ఆవాసము, క్రొంగ్రొత్త సృష్టి 379

నాలుగవ సర్గ : దివ్య దర్శనము, వరప్రదానము 398

## రెండవ భాగము

నాలుగవ గ్రంథము: జననము, అన్వేషణ

మొదటి సర్గ : జ్వాల జననము, శైశవ దీప్తి 419

రెండవ సర్గ : జ్వాల ఎదుగుదల 431

మూడవ సర్గ : అన్వేషణకు పిలుపు 443

నాలుగవ సర్గ : అన్వేషణ 452

ఐదవ గ్రంథము: ప్రణయ బంధము

మొదటి సర్గ : విధి నిర్ధారిత సంధాన స్థలము 465

రెండవ సర్గ : సత్యవంతుడు 468

మూడవ సర్గ : సావిత్రి, సత్యవంతులు 478

ఆరవ గ్రంథము: విధి సూచకము

మొదటి సర్గ : విధి నిర్ధారిత జగతి 495

రెండవ సర్గ : విధి తీరుతెన్నులు, వెతల సమస్య 520

ఏడవ గ్రంథము: యోగ మార్గము

మొదటి సర్గ : సమాగమ సంతసము, పూర్వ జ్ఞాతమైన మృత్యువుగొని తెచ్చు సంక్షోభము, విషణ్ణ హృదయము 551

రెండవ సర్గ : ఆత్మకొరకు అన్వేషణ గాథ 562

మూడవ సర్గ : అంతర్లోకముల ప్రవేశము 578

నాలుగవ సర్గ : త్రితయ ఆత్మశక్తులు 595

ఐదవ సర్గ : ఆత్మ దర్శనము 617

ఆరవ సర్గ : నిర్వాణ సిద్ధి, నిరంకుశమగు నాస్తికతత్త్వపు ఉనికిని కనుగొనుట 628

ఏడవ సర్గ : విశ్వాత్మజ్ఞానము, విశ్వాత్మ చైతన్యము కనుగొనబడుట 649

ఎనిమిదవ గ్రంథము: మృత్యువు

*మూడవ సర్గ : వనమున మరణము 659

## మూడవ భాగము

తొమ్మిదవ గ్రంథము: అంతరహిత నిశీథిని

మొదటి సర్గ : నలనల్లని, నిరర్థక శూన్యముల వైపు 669

రెండవ సర్గ : అనంత నిశీథినియందలి యాత్ర: అంధకారపు స్వరము 683

పదవ గ్రంథము: ఇనుమడించిన ఉదయాత్పూర్వ కాంతులు

మొదటి సర్గ : ఉదాత్తుల స్వప్నజనితములగు ఉదయాత్పూర్వ కాంతులు 701

రెండవ సర్గ : మృత్యు సందేశము, ఉదాత్తుల స్వాతిశయము 709

మూడవ సర్గ : మృత్యువుతో ప్రేమానురాగముల వాదము 725

నాలుగవ సర్గ : యథార్థ జగతియందలి స్వాప్నిక సంధ్య 748

పదకొండవ గ్రంథము: అనశ్వర దివసము

మొదటి సర్గ : ఆది మధ్యాంతరహిత దినము : ఆత్మ స్వయంవరము, అత్యున్నత సంధానము 783

పన్నెండవ గ్రంథము: భరతవాక్యము

భూతలమునకు పునరాగమనము 833

---

** రూపాంతరము చేయబడిన తొలిపాఠమున ఇది మూడవ సర్గ. మలి పాఠమున సైతము మూడవసర్గగానే పేర్కొనబడినది.*



## మొదటి సర్గ

# వేకువ సంకేతము

అది అమరులు నిద్రిస్తున్న వేళ. 1
వారు మేల్కొనడానికి ఒక్క గడియ ముందు
శబ్దానికి భావం, కాలానికి గతి, ఇంకా ఏర్పడలేదు.
అది ఆది మధ్యాంత రహిత నిశ్శబ్ద జగతి. అంతటా నిండిన శూన్యం.
ఎక్కడో రూప గుణాతీతమైన ఒక అంతశ్శక్తి మేలుకుంటున్న జాడ
అంతటా అలుముకున్న సృష్టి రహస్యపు చీకట్లు, చీకట్లను ఛేదించుకుంటూ
గుర్తు తెలియని గమ్యాలను చేరుకోవాలని తపిస్తున్న ఒక అజ్ఞాతశక్తి కదలిక
చేతన – అచేతనావస్థల మధ్య కొట్టు మిట్టాడుతున్న జ్ఞాన శూన్యమైన శక్తి,
వదలని నిద్ర మత్తులో తనచుట్టు తాను తిరుగుతున్న సవ్వడి
జాడలేని నీడగా, కనిపించని కలగా,
బుద్ధి పరిధికి ఆవల నిలచిన భావంగా, జగతి మేలుకుంటున్న అలికిడి.
లేవాలనే తపన వెళ్ళాలనే యాతన 2
ఎక్కడికి వెళ్ళాలో తెలియని అయోమయం.
రూపు సంతరించుకోవడానికి వదలని బృహత్ప్రయత్నం
రూపు రేఖలు నిర్ధారించుకోలేని అశక్తత
సుదూర గతంలో ఒక ఫలించని కోరిక
చెదరిన స్మృతి, మూతబడిన కన్నులు,
తన్ను తాను వెదుక్కుంటున్న ఒక విఫల ప్రయత్నం.
పాతిపెట్టబడిన గతంలోంచి ఒక వారసత్వం ఒళ్ళు విదుల్చుకుంది.
పురిటి నొప్పుల్లోంచి బయట పడటానికి ఇది మరో ప్రయత్నం, మరో ప్రపంచం.
బుద్ధిలోంచి స్పృహకు, స్పృహలోంచి ప్రజ్ఞవైపు, ఎప్పుడో రానున్న మహాప్రస్థానం వైపు,
ఒక్క వెలుగు రేఖ కనిపిస్తుందేమోనన్న ఆశ.
బ్రహ్మాండపు బుగ్గమీద పురిటిబిడ్డ వేలి స్పర్శ.
తళుక్కున మెరిసిన ఒక మెఱపు, ఛళ్ళున తెఱచుకున్న ఒక తలుపు
మూగవోయిన అగాధాలవైపు, చూపు సారించిన ఒక దివ్యచక్షువు
ఆధిభౌతిక శక్తులు సేద తీరిన వైనం.
కుంటువడిన ఆనందహేల కోసం వెదకుతున్న ఆదిత్య హృదయం.
జడత్వం అలసత్వం కలిసి తెచ్చిన మత్తులోంచి, మగత నిద్రలోంచి,

ప్రజ్ఞ పరాకాష్ఠగా, ఆనందం పరమావధిగా
ఆధిభౌతిక ప్రపంచాల నుండి వినిపిస్తున్న పిలుపు.
నిరాశ, నిస్పృహలతో క్రుంగిపోయిన ప్రకృతి, మళ్ళీ 3
చూపులతో, స్పర్శతో తన్ను తాను సంబాళించుకుంది
'లోచన' లోంచి 'ఆలోచన' ఉద్భవించింది
నిశీథిని చీల్చి, నిశ్శబ్దాన్ని ఛేదించింది.
శిథిల సమాధిలోంచి బయట పడ్డ జీవం
పతనం చెఱిపిన స్మృతుల్లోంచి గతాన్ని అన్వేషించి
కొత్త పుంతలు సంతరించు కోవాలి
కొత్త ఆశ్రయం వెతుక్కోవాలి.
స్వర్గలోకాల్లోంచి, వ్యక్తావ్యక్తంగా కనిపించిందో అభయముద్ర.
మేలుకున్న ఆశల స్వప్నాలు
తెఱచుకున్న అజ్ఞాత లోకాల ద్వారాలు
ద్వారాల కావల పసిడి వాకిళ్ళు
ఆ మూల సౌధాల దాగిన సత్యాలు.
జారిపడిన దేవుడి ఉత్తరీయంలా
చెదరిపోయిన చీకట్లు.
ఒక్కసారిగా వెలుగు చూసిన దార్శనిక జగత్తు
చిరు చీలిక లోంచి కనిపించిన తొలి వెలుగు
కోటి సూర్యుల దివ్యతేజమై ఎల్లెడల వ్యాపించి,
అజ్ఞాత లోకాలను ముంచెత్తి,
అవ్యక్త సత్యాల హరివిల్లును ఆవిష్కరించింది.
ఈ ఉషోదయం ఒక నవోదయంగా 4
తన వింత కాంతుల్ని అనంత కాలపు ఘడియల్లో విత్తనాలుగా వెదచల్లింది.
ఆకాశపు కాగితం పుటల మీద ఆధ్యాత్మిక ఉషోదయాల
రంగురంగుల బొమ్మల కథ వెలసింది.
ఆనందానికి, అధి భౌతిక సౌందార్యానికి నిర్వచనం వ్రాయబడింది.
ఇకపై అంతా తేటతెల్లం, ఇది ఒక భావవిస్ఫోటం.
మదిలో ఎగసిన మాటల మంటలు అందుకు సాక్ష్యం.
బ్రహ్మాండపు కేంద్ర బిందువు నుండి
తెఱచిన నిమీలిత నేత్రాలు స్వర్గానికి ద్వారాలు.
అంతవఱకు, ఖగోళాంతరాళాల మధ్య చిక్కుకున్న,